

తెలుగు తమ్ముళ్ల తన్నులాట

కలసపాడు టీడీపీ కార్యాలయంలో గురువారం 'తమ్ముళ్ల' మధ్య ఘర్షణ జరిగింది. పార్టీ కార్యాలయంలోనే ఒకరిపై ఒకరు పిడి గుద్దులతో వీరంగం సృష్టించారు. -8లో



బయనపల్లెలో ఉద్రిక్తత

బయనపల్లెలో గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చేందుకు అధికారులు వచ్చారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.7/26.4

వాతావరణం

జిల్లాలో గురువారం 26.4 - 36.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'వందేభారత్' ట్రయల్ రన్ విజయవంతం

కడప కోటిరెడ్డిసర్కిల్: దేశంలో అధిక వేగంతో నడుస్తున్న రైళ్లలో ఒకటైన వందే భారత్ రైలు గురువారం కడప- రేణిగుంట మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. కాచిగూడ-చెన్నై మార్గంలో వందేభారత్ రైలు నడిపేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించినట్లు సమాచారం. కాగా 130 కి.మీ. స్పీడ్‌తో రైలు నడిచినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని రైల్వే అధికారులు గుర్తించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో త్వరలోనే ఈ మార్గంలో వందేభారత్ రైలు నడిచే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

220 మంది హాజరు



వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగిన కౌన్సెలింగ్‌కు 86001వ ర్యాంకు నుంచి 104000 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 220 మంది అభ్యర్థులు తమ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసుకుని ధ్రువ పత్రాలను పరిశీలించుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఎస్ఆర్ లక్ష్మి ప్రసాద్, వెరిఫికేషన్ ఆఫీసర్లు వసుంధర, మల్లేశ్వరమ్మ, లావణ్య, రాజేష్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

నేడు నిర్వహించబోయే కౌన్సెలింగ్‌కి జిల్లావ్యాప్తంగా 104001 నుంచి 120000 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు రావాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

5 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

రాజంపేట: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 5 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమల టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి గురువారం తాళ్లపాక, సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవోలునటేష్‌బాబు, ప్రశాంతి పాల్గొన్నారు.

వక్ఫ్‌కి దిక్కెవరు

- కోట్ల ఆస్తులున్నా... పర్యవేక్షణ కరువు
- ఒక్క రెగ్యులర్ సిబ్బంది లేని వైనం



కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ కార్యాలయం అనగానే ఒక అధికారి, సిబ్బంది, ఫర్నీచర్, కంప్యూటర్లు వంటివి గుర్తుకు రావడం సహజం. కానీ సిబ్బందే లేని కార్యాలయం ఒకటుందంటే నమ్మగలమా? తప్పదు నమ్మి తీరాల్సిందే. ఎందుకంటే అది నిజం. కలెక్టరేట్‌లో ఉన్న వక్ఫ్‌బోర్డు కార్యాలయం నిత్యం బోసిపోయి కనిపిస్తోంది. అక్కడ మహిళా అటెండర్ మినహా రెగ్యులర్ సిబ్బంది ఒక్కరూ లేరు. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న వసీం అనే వ్యక్తి పొరుగునున్న అన్నమయ్య జిల్లాకు చెందిన ఉద్యోగి. ఎప్పుడు వెళ్లినా ఆ కార్యాలయం ఖాళీగా దర్శనమిస్తుంది. ఇన్‌ఛార్జి వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ వసీం అందుబాటులో ఉండరు. ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియదు. కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో ఉండరు. ఏదైనా పనిపడి వెళ్లే ప్రజలు ఆయన లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వస్తోంది. ఏదైనా పది రూపాయలు వస్తాదనుకుంటే అప్పుడు మాత్రం ప్రత్యక్ష మవుతారనే ఆరోపణలు ఉన్నాయి. వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నాయి. ఇవి కబ్జాలకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత వక్ఫ్‌బోర్డుకు ఉంటుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి లేదు. అందుకే వక్ఫ్‌బోర్డుకు రెగ్యులర్ సిబ్బందిని ఏర్పాటు చేయలేదనే విమర్శలు సర్వత్రా వినబడుతున్నాయి.



కడపలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయం

రూ. కోట్ల విలువైన ఆస్తులు



జిల్లా వ్యాప్తంగా మసీదులు, దర్గాలు, పీర్ల చావిళ్లకు వందల కోట్లు విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ పూర్వీకులు దానంగా ఇచ్చారు. ఈ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో ఆయా సంస్థలను నిర్వహించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 277 సంస్థలకు 1960.27 ఎకరాల భూములు ఉన్నాయి. ప్రస్తుత వైఎస్సార్ కడపజిల్లాలోని 219 సంస్థలకు 1648.08 ఎకరాల ఆస్తులు ఉన్నాయి. మండలాల వారీగా పరిశీలిస్తే అట్లూరు 4.25 ఎకరాలు, కలసపాడు 2.34, గోపవరం 2.16, పోరుమామిళ్ల 92.97, బద్వేలు 78.29, కాశినాయన 47.59, బి.కోడూరు 7.45, బ్రహ్మంగారిమఠం 29.60, కడప 58.82, ఖాజీపేట 19.21, ఎర్రగుంట్ల 14.16, కమలాపురం 12.77, పెండ్లిమర్రి 176.18, వల్లూరు 16.11, వీఎన్ పల్లె 59.76, చెన్నూరు 108.01, ప్రొద్దుటూరు 28.93, మైదుకూరు 71.34, దువ్వూరు 159.01, పులివెందుల 12.67, వేంపల్లె 11.40, తొండూరు 59.73, సింహాద్రిపురం 71.0, లింగాల 41.95, చక్రాయపేట 67.38, సిద్దవటం 80.15, ఒంటిమిట్ట 6.79, జమ్మలమడుగు 28.57, మైలవరం 12.56, పెద్దముడియం 232.50, కొండాపురం 18.67, రాజుపాలెం 11.92, చాపాడు మండలంలో 43.84 ఎకరాలు ఉన్నాయి. చింతకొమ్మదిన్నె, ముద్దనూరు, వేముల మండలాల్లో వక్ఫ్ ఆస్తులు లేవు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ



జిల్లా వక్ఫ్ బోర్డు పరిధిలో ఎన్నో విలువైన ఆస్తులు ఉన్నాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉంటుంది. కానీ వక్ఫ్‌బోర్డుకు చాలా రోజులుగా రెగ్యులర్ అధికారి లేరు. అటెండర్ మినహా కార్యాలయంలో ఒక్కరూ లేరంటే ఇది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. ఇప్పటికైనా స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించడం ద్వారా ఆస్తులను కాపాడాలి.

– కేసీ బాదుల్లా, సీపీఐ నాయకుడు, కడప

ఆస్తులు పరిరక్షించాలి



జిల్లాలో వక్ఫ్ బోర్డు పరిధిలోని మసీదులు, దర్గాలు, పీర్ల చావిడిలకు సుమారు 1600 ఎకరాలు భూములు ఉన్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం 300 ఎకరాలు కూడా లేదంటే ఆస్తులు ఎలా కబ్జాకు గురయ్యాయో అర్థమవుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం.

– షేక్ మగ్బూల్, రాష్ట్ర కార్యదర్శి, ఆప్ కీ అవాజ్,కడప

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలోనూ, ఇటీవల జరిగిన మహానాడు సందర్భంగా వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ కిందిస్థాయిలో రెవెన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కడప నగరంలోని సర్వే నెంబరు 305లో ఉన్న 0.25 సెంట్ల మసీదు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, దాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

– షేక్ దస్తగిరి, రాష్ట్ర అధ్యక్షుడు, మైనార్టీ రైట్స్ ఫోరం, కడప

సచివాలయ ఉద్యోగుల బదిలీలలు

- జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉండే కమిషనర్‌కు బదిలీ చేసే అధికారం
- మెరిట్ లిస్టు ప్రకటించని అధికారులు
- బదిలీలు ఎలా జరుగుతాయోనని ఉద్యోగుల్లో ఆందోళన
- అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల చుట్టూ ప్రదక్షిణలు



కడప కార్పొరేషన్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పురపాలక శాఖ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేసే అధికారం జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉండే కమిషనర్‌కు కట్టబెడుతూ పురపాలకశాఖ ఆర్‌డీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ లెక్కన కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జిల్లాలోని ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, బద్వేల్, జమ్మలమడుగు, కమలాపురం మున్సిపాలిటీల్లోని సుమారు 256 వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులందరికీ కడపలోనే కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు నిర్వహించనున్నారు.

- కడప కార్పొరేషన్‌లో ఇంతవరకూ ఉద్యోగుల మెరిట్ లిస్టుగానీ, ఖాళీలను గానీ చూపలేదు. కనీసం హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేయలేదు. ఈలోపే అత్యధికమంది సచివాలయ ఉద్యోగులు సిఫారసు లేఖల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఎవరెవరిని ఏ వార్డులో వేయాలో, ఎవరిని బదిలీ చేయాలో తమ లెటర్ హెడ్‌లో జాబితాలు కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు తమ జాబితాను కమిషనర్‌కు పంపినట్లు ప్రచారం సాగుతోంది. కడపలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇదివరకే వార్డు సచివాలయ ఉద్యోగులను ఎక్కడికి పడితే అక్కడ బదిలీ చేశారు. ఈ సారి బదిలీల్లో కూడా 'ఆమె జాబితా'కు ఆమోద ముద్ర తప్పదని తెలుస్తోంది.

టీడీపీ ఇన్‌చార్జులకు ఆయుధంలా...

అన్ని మున్సిపాలిటీల్లోనూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నారు. అయినా టీడీపీ ఇన్‌చార్జులు తమ మాటే నెగ్గాలన్న పట్టుదలతో వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులను బెదిరించి, భయపెట్టి తమ దారికి తెచ్చుకోవాలని చూస్తున్నారు. ఈ బదిలీలను ఒక ఆయుధంలా వాడుకొని తమకు నచ్చిన వారిని, తాము ఏది చెబితే అది చేసేవారిని వార్డు సచివాలయాల్లో నియమించుకోవాలని ఎవరికి వారు పట్టుదలతో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో పారదర్శకంగా ...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకం చాలా పారదర్శకంగా మెరిట్ ప్రకారం పక్కాగా జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అంతే పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు.

2 నుంచి తరగతులు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: పేద విద్యార్థులకు అధునాతన వసతులు, నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో జిల్లాలోని బి.మఠంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర మహా గురుకులంలో జూలై 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో బి.మఠం మండలంలో ఏర్పాటైన డా.బి.ఆర్.అంబేడ్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో తరగతుల ప్రారంభానికి సంసిద్ధత, విద్యార్థుల అడ్మిషన్ అంశాలపై సమావేశం నిర్వహించారు.అత్యాధునిక సదుపాయాలు, వసతులతో రూపు దిద్దుకున్న ఈ గురుకులంలో ఈ విద్యా సంవత్సరానికి 800 మంది విద్యార్థులతో అడ్మిషన్లు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

డ్రగ్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- జేసీ, ఎస్పీల పిలుపు
- నగరంలో వాకథాన్ ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ కడపను డ్రగ్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని, అందుకోసం ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. గురువారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం,ఈగల్ (ఎలైట్ యాంటి-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వాకథాన్ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యే మాధవీరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టడం కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల వసతి గృహాలు, కాలేజీలు, పాఠశాలల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతినిత్యం తల్లిదండ్రులు తమ పిల్లల చెడు వ్యసనాలపై అప్రమత్తంగా వ్యవహరించి వారిలో మంచి అలవాట్లపై అవగాహన పెంచాలన్నారు. ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు,వినియోగాన్ని నిరోధించడానికి 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కి తెలియజేస్తే చట్టపరమైన కఠినమైన చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాటాడారు. అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, ఆర్డీవో జాన్ ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే మాధవిరెడ్డి

నెత్తురోడ్లుతున్నాయ్!

రహదారులు నెత్తురోడుతున్నాయి. మితిమీరిన వేగం.. నిర్లక్ష్యం.. నిద్ర లేమి.. వెరసి రోడ్డు ప్రమాదాలతో ఎరుపెక్కాయి. ఇటీవల జిల్లాలో జరిగిన వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎంతో మంది ప్రాణాలు పోతున్న ఈ ఘటనలు ఆయా కుటుంబాలు తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. 2025 మే 26న గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో కారు లారీ ఢీకొన్న ప్రమాదాలల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు.

▲ గత వారంలో రాయచోటి నుంచి హైదరా బాదుకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది.

- ఒకరి నిర్లక్ష్యం.. మరొకరికి ప్రాణ సంకటం
- మితిమీరిన వేగంతోనే రోడ్డు ప్రమాదాలు
- ఐదు నెలల్లో 172 మంది మృత్యువాత



గువ్వల చెరువు ఘాట్‌లో బోల్తా పడి మృతి చెందిన వ్యక్తి (ఫైల్)



బుగ్గలేటి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ఐదు నెలల వ్యవధిలో సమారు 307 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సుమారు 172 మంది మృత్యువాత పడగా 364 మంది క్షతగాత్రులయ్యారు. వేగ నియంత్రణ అమలు చేయకపోవడం, రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఆచరణలో పెట్టకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఈ విషయాల్లో పునః సమీక్షించాల్సిన అవసరం ఉంది.

కారణాలెన్నో......

మితి మీరిన వేగం, మద్యం మత్తు, ఓవర్‌టేక్, అకస్మాత్తుగా వాహనం నిలపడం, ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం తదితర విషయాలు ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారులపై లారీలను ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. హోటళ్లు, దాబాలు, ఇతర దుకాణాల వద్ద హైవేకి అనుకొని ఆపుతున్నారు. ఈ క్రమంలో వెనుక వచ్చే వాహనాలు వేగాన్ని నియంత్రించలేక వాటిని ఢీ కొంటున్నాయి. లారీలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా విశ్రాంతి స్థలాల్లో మాత్రమే నిలపాల్సి ఉన్న అక్కడ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండటంతో రోడ్లకు అనుకొని, చెట్ల కింద ఆపడం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రైవేట్ బస్సులు అధికంగా రాత్రి వేళ తిరుగుతుంటాయి. ఈ క్రమంలో అందులో క్లీనర్‌గా పని చేసే వారు అరకొర డ్రైవింగ్‌తో అప్పుడప్పుడు వాహనాలు నడుపుతున్నారు. రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడం, ముందు వెళుతున్న వాటిని వేగంగా అధిగమించే క్రమంలో పట్టుకోల్పోయి ప్రమాదాలకు కారణమవుతున్నారు.

తీర్మానం చేసినా.... ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 70 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, బారికేడ్లు, రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీర్మానించారు. అది కార్యరూపం దాల్చినా కేవలం ఒకటి రెండు చోట్లకే పరిమితమైంది. అనంతరం అధికారులు అటు వైపు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతయినా ఉంది. నిద్ర మత్తులో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు గతంలోనే గుర్తించారు. వాహన డ్రైవర్ల నిద్ర మత్తు తొలగేలా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్లో ప్రమాదాలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. కాలక్రమంలో దీనికి బ్రేక్ పడింది.

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024	664	321	737
2025 మే వరకు	307	172	364

ఇలా చేస్తే...

జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా చూడాలి. నిబంధనల మేరకు ముందు, వెనుక వాహనాలకు రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు అతికించాల్సిన అవసరం ఉంది. ఇవి రాత్రి వేళల్లో వాహనచోదకునికి ముందు వాహనం ఉందనే విషయాన్ని స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. వేగ నియంత్రణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా చూడాలి. అతి వేగంతో దూసుకెళుతున్న వాహనాలను నిఘా కెమెరాలతో గుర్తించి వెంటనే క్లెయిం వేయాలి. సంబంధిత వాహన యజమాని సెల్‌ఫోన్‌కు సందేశం పంపి అప్రమత్తం చేయాలి. బ్లాక్ స్పాట్‌లలో సూచిక బోర్డులు, విద్యుద్దీపాలు, రహదారి మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలి. రోడ్డు సేఫ్టీ కమిటీ నిర్ణయాలను అమలు చేయాలి. వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలి. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక దృష్టి సారించాలి. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి.

రోడ్డు నిబంధలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం



రోడ్డు నియమ నిబంధలను ఉల్లంఘించే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. వాహనాల వేగ నియంత్రణను అరికట్టేందుకు స్పీడ్ లేజర్ గన్‌లతో తనిఖీలు చేపడుతున్నాం. మద్యం మత్తుల్లో వాహనాలను నడిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

-నిరంజన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

ఉపాధి పనుల తనిఖీ

సిద్దవటం: మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న బెటాలియన్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఉపాధి ఏపీఓ నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీల మస్టర్‌ను పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లో ఉపాధి పనుల నిమిత్తం గతం వారం నుంచి కాలువ పనులు కొనసాగుతున్నాయన్నారు. కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు కూలీలు చేపట్టిన కాలువల ద్వారా చెరువులు, పెన్నా నదిలోకి వెళ్లే విధంగా పనులు చేపడుతున్నామన్నారు. దీని ప్రభావంతో రైతుల బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కుంటలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల వణ్య ప్రాణులకు తాగునీటి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. బెటాలియన్‌లో కాలువ పనులు రెండు నెలల పాటు కొనసాగుతాయన్నారు. ఉపాధి కూలీలు చేసిన పనులకు నగదు చెల్లింపులకు అధికారులకు నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంటు పుల్లయ్య, మేటిలు, కూలీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణ శివారు ప్రాంతంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొద్దుటూరు ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ప్రొద్దుటూరు ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. దాడిలో సీకే దిన్నె మండలంలోని మామిళ్లపల్లె గ్రామానికి చెందిన బి.రామాంజనేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను స్థానికంగా ఉన్న పలు కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కడప కేంద్ర కార్యాలయంలో సెల్ ఫోన్ లభ్యం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప కేంద్ర కాగారంలో ఇటీవల ఖైదీల వద్ద తరచూ సెల్‌ఫోన్లు దొరుకుతున్నాయి. ఇటీవల ఎర్రచందనం కేసులో జైలుకు వచ్చిన స్మగ్లర్ల వద్ద జైలు అధికారులు పలుమార్లు సెల్‌ఫోన్లు గుర్తించారు. చిత్రావతి బ్యారక్ సమీపంలో రెండురోజుల క్రితం అధికారులు సెల్ ఫోన్ గుర్తించి ఎవరెవరికి ఫోను చేశారన్న విషయంపై రిమ్స్ పోలీసు స్టేషన్లో జైలు అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. గతంలో జైలులో గంజాయి పొట్లాలతో పాటు సెల్‌ఫోన్లు, గుట్కా ప్యాకెట్లు తరచూ దొరుకుతుండేవి. జైలు అధికారులు కట్టుదిట్టంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పినప్పటికీ పదేపదే ఖైదీలున్న బ్యారక్ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ దొరకడం చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతోంది. కడప కేంద్ర కారాగారంలో సెల్ ఫోను దొరకడంపై సూపరింటెండెంట్ రాజేశ్వరరావును వివరణ కోరగా, బ్యారక్ సమీపంలోని ఆవరణంలో శుభ్రపరుస్తున్న సమయంలో పాత పనికిరాని సెల్‌ఫోన్ దొరికిందని, నిరంతరం తనిఖీలు చేస్తూనే ఉన్నామని తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల తన్నులాట

- కలసపాడులో ఉద్రిక్తత
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు


టీడీపీ కార్యాలయం ఎదుట తన్నుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

కలసపాడు : స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం టీడీపీ జిల్లా మైనారిటీ పార్లమెంట్ అధ్యక్షుడు, కలసపాడు పార్టీ అబ్జర్వర్ ఖాదర్‌బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ల, పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. మండలంలోని ఇ.తంబళ్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రహ్లాద రెడ్డికి, ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన నారాయణరెడ్డి వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వైఎస్సార్‌సీపీకి కోవర్టుగా ప్రహ్లాదరెడ్డి పనిచేస్తున్నాడని నారాయణరెడ్డి ఆరోపించాడు. తాను ఈ పార్టీలో ఉన్నానని, వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చి తనను విమర్శిస్తావా అని ప్రహ్లాదరెడ్డి నారాయణరెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు సాధనకారి రంతు జోక్యం చేసుకోవడంతో మరింత ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పార్టీ కార్యాలయంలోనే తన్నులాట కొనసాగించి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుంటూ చొక్కాలు చించుకుని వీరంగం సృష్టించారు. మండలంలో గత కొంత కాలంగా ప్రహ్లాదరెడ్డి టీడీపీలో జరుగుతున్న అన్యాయాలపై స్థానిక మీడియా ద్వారా అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. పార్టీకి వీరవిధేయుడుగా ఉన్న ప్రహ్లాదరెడ్డి అంటే నియోజకవర్గ యువ నాయకుడికి నచ్చలేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏదో ఒక విధంగా ప్రహ్లాదరెడ్డిపై దాడి చేయాలని ముందుగా నిర్ణయించుకుని పథకం ప్రకారం దాడి చేసినట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నా సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం పలు విమర్శలకు తావిస్తోంది. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు కలసపాడుకు చేరుకుని కొంత మేర సమస్యను సద్దుమణిగేలా చూశారు. తర్వాత ప్రహ్లాదరెడ్డిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తీవ్ర స్థాయిలో మందలించినట్లు తెలిసింది. మండలంలో తెలుగు తమ్ముళ్లు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఇటీవల విమర్శలు గుప్పించడంతోపాటు ఆధిపత్యానికి తెరతీశారు. మండలంలో అంతంత మాత్రమే బలం ఉన్న టీడీపీ రెండు గ్రూపులుగా విడిపోయి బాహాబాహికి దిగడంతో పార్టీ పరిస్థితి మరింత దిగజారిందని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు.

అశ్రునయనాలతో హవల్దార్‌కు అంత్యక్రియలు


జవాన్ శివప్రకాష్‌రెడ్డి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న సబ్ మేజర్ దిలీప్ పాల్

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు గ్రామానికి చెందిన హవల్దార్ బూచుపల్లె శివప్రకాష్‌రెడ్డి బుధవారం సాయంత్రం గుండె పోటుతో మరణించిన విషయం తెలిసిందే. గురువారం హవల్దార్ అధికారి శివప్రకాష్‌రెడ్డి మృతదేహం వద్ద సబ్ మేజర్ దిలీప్ పాల్ జాతీయ జెండాను ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకాష్‌రెడ్డి యూనిఫాం, జాతీయ జెండాను భార్య నాగేశ్వరి, కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం స్మశాన వాటిక వరకు శివప్రకాష్‌రెడ్డి అంతిమ యాత్ర జన సందోహం మధ్య జరిగింది. స్మశాన వాటిక వద్ద గాలిలోకి కాల్పులు జరిపి భారత్ మాతాకీ జై, జై జవాన్, జై కిసాన్, ప్రకాష్‌రెడ్డి అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మిలటరీ అధికారులు హవల్దార్లు సి.ఎల్.రెడ్డి, ఎస్.కె.ఎస్.హరీష్, మాజీ హవల్దార్‌లు రామమణిరెడ్డి, నరసింహారెడ్డి, ఎస్.కె.శ్రావణ్‌రెడ్డి, ఎస్ఐ ఘన మద్దిలేటి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని అడవిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. కాశినాయన ఎస్ఐ యోగేంద్ర తెలిపిన వివరాల మేరకు సుమారు 20 రోజుల క్రితం ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసుకుని సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశామని ఎస్ఐ తెలిపారు.

మంత్రి లోకేష్ హామీ మూన్నాళ్ల ముచ్చటే

కాశినాయన : ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వ్యవహార శైలి ఉందని ప్రజలు అంటున్నారు. మాట ఇవ్వడం, ఆపై హామీ నెరవేర్చకపోవడం చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య. ఈ విషయంలో నారా లోకేష్ తండ్రికి మించిన తనయుడిగా ఆరితేరాడు. కాశినాయన జ్యోతి క్షేత్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు రకాల కట్టడాలను కూల్చివేశారు. ఈ విషయం మాధ్యమాల్లో రావడంతో మంత్రి లోకేష్ దృష్టికి చేరింది. ఆయన స్వయంగా తన పీఏ కేకే చౌదరిని పంపించి కూల్చివేసిన కట్టడాలను తిరిగి పునర్నిర్మించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కేకే చౌదరి వచ్చి రూ.5లక్షలతో స్వల్ప నిర్మాణాలు చేపట్టి వెళ్లిపోయాడు. ఆర్టీసీ బస్సును కూడా పునరుద్ధరించాలని లోకేష్ ఆదేశాలతో మూడు నెలల నుంచి జ్యోతి క్షేత్రానికి బస్సు నడిపిస్తున్నారు. అయితే గురువారం నుండి జ్యోతి క్షేత్రానికి బస్సు నిలుపుదల చేయాలని చీఫ్ కన్జర్వేటర్ నుండి ఫారెస్ట్ అధికారులకు ఆదేశాలు రావడంతో ఫారెస్టు అధికారులు మైదుకూరు డిపో వారిని బస్సు నడపవద్దని ఆదేశించడంతో బస్సు ఆగిపోయింది. దీంతో ప్రజలు నిరసన తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు


వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు వరలక్ష్మి

వేంపల్లె : స్థానిక శ్రీరాం నగర్‌లో నివాసముంటున్న వరలక్ష్మి అనే మహిళను ఆమె భర్త రవి అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు, ఆమె తల్లిదండ్రులు తెలిపారు. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేముల మండలం దుగ్గన్నగారిపల్లెకు చెందిన గంగోజీ, గీత దంపతుల కుమార్తె వరలక్ష్మికి వేంపల్లె మండలం వీరన్నగట్టుపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య కుమారుడు దేరంగులరవితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కూతురు మన్విక ఉన్నది. ప్రస్తుతం మూడు నెలల గర్భవతిగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. గత కొన్ని నెలలుగా వరలక్ష్మి భర్త రవి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. అయితే ఈనెల 2వ తేదీన ఆమె తల్లిదండ్రులు వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బాధితురాలి భర్త రవికి స్థానిక టీడీపీ నేతల అండదండలు ఉండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు తెలిపారు. ఆ తర్వాత కడప మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తన ఇంటి వద్దకు వచ్చిన వరలక్ష్మి భర్త దేరంగుల రవి, అతని చిన్నాన్న కొడుకు కృష్ణమూర్తి, తండ్రి వెంకటసుబ్బయ్య, చిన్నాన్న వెంకటరమణలు వరలక్ష్మిని విచక్షణ రహితంగా కాలితో కడుపుపైన కొట్టారన్నారు. ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్ల కేటాయింపులో రోస్టర్ విధానం అమలు చేయాలి


పులివెందుల టౌన్ : ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ సీట్ల కేటాయింపులో రోస్టర్ విధానం అమలు చేయాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిశోర్ కోరారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎస్‌పీఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పునరాలోచించి రోస్టర్ విధానం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లలో అవకాశం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో మార్కులను బట్టి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవకాశాలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదేవిధంగా అవకాశం ఇస్తే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

భవనం మీద నుంచి కింద పడి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి


మృతిచెందిన ఖాజావలీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : అన్నమయ్య జిల్లాలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న రాయపాటి ఖాజావలీ (50) ప్రమాదవశాత్తు భవనం మీద నుంచి కిందపడి మృతి చెందినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రాజ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు గురువారం సాయంత్రం కడప అశోక్ నగర్ లోని తమ ఇంటి సిమెంటు రేకులపై వర్షం నీళ్లు పడకుండా ప్లాస్టిక్ పట్ట కప్పేందుకు తన భార్యతో కలిసి పైకి ఎక్కారు. ఇద్దరూ పట్ట కప్పుతుండగా ఖాజావలీ నిలుచున్న ప్రదేశంలో ప్రమాదవశాత్తు సిమెంటు రేకులు విరగడంతో పైనుంచి కింద పడ్డాడు. తల వెనుక భాగంలో రక్త గాయమై ముక్కు నుంచి రక్తం కారుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతని భార్య బంధువులతో కలిసి నగరంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఇతనికి భార్య మాబున్నీ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష



మాట్లాడుతున్న ఐఏఎల్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సుబ్రమణ్యం

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఈనెల 28న కడప జిల్లా కోర్టులో గల కడప బార్ అసోసియేషన్ హాలులో భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఇ.సుబ్రమణ్యం కార్యనిర్వాహక అధ్యక్షుడు టి. ఈశ్వర్ తెలిపారు. గురువారం నగరంలోని బసవతారకం లా కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు హాజరు కానున్న యువ న్యాయవాదులకు ఈ మోడల్ టెస్ట్ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కడప బార్ అసోసియేషన్ హాలులో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 99633 28876, 70137 40055, 94411 21181 నంబర్లకు ఫోన్ చేసి 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల్లో రాజకీయాలొద్దు

వేంపల్లె : గండి వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనుల్లో రాజకీయాలొద్దని, ఆలయం పూర్తికి ఇంకా ఏడాది సమయం పడుతుందని జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని హడావిడిగా రాబోయే శ్రావణ మాసానికి ఆలయాన్ని తెరిపించే పనులు చేపట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దశరథ, జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో నామినేషన్ దాఖలుకు గురువారం చివరి రోజు కావడంతో కేవలం మజ్దూర్ యూనియన్ వర్గం మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈమేరకు సంబంధిత అధికారి నిర్ధారించాల్సి ఉంది. మజ్దూర్ యూనియన్ తరుపున రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీగా రవి కుమార్, సంయుక్త కార్యదర్శిగా నరేష్‌కుమార్, కోశాధికారిగా వెంకటేశ్వరరెడ్డి, ఆపరేటింగ్ కమిటీ సభ్యునిగా లక్ష్మీనారాయణ, చిన్నబాబు, ఎలక్ట్రికల్, కమర్షియల్ ఇంజనీరింగ్ ఎస్అండ్‌టీ కమిటీ సభ్యులుగా రాజేష్‌కుమార్, అనిల్‌కుమార్, గీత, మస్తాన్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ప్రాధాన్యం పెంచాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో స్పోర్ట్స్ రంగంలో తలెత్తిన ఫేక్ సర్టిఫికెట్స్ సమస్యలపై దృష్టి సారించి వాటికి అడ్డుకట్ట వేసి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ప్రాధాన్యత పెంచాలని ఏపీపీఈటీస్ అండ్ ఎస్ఏపీఈ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, సభ్యులు కోరారు. ఈ విషయమై రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటిలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వీరాంజనేయులు, జగదీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు తస్కరించి రూ.25 వేలు డ్రా

నందలూరు : మండల కేంద్రంలో ఏపీజీబీ ఏటీఎంలో ఓ వ్యక్తికి మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డు తస్కరించి రూ.25 వేలు డ్రా చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు విశ్రాంత ఉపాధ్యాయుడు సానిపాటి నరసింహులు వివరాల మేరకు ఏపీజీబీ ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి తన ఏటీఎం కార్డును చోరీ చేసి ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.25 వేలు డ్రా చేసుకున్నాడు.

బయనపల్లెలో ఉద్రిక్తత

- వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిని కూల్చివేసేందుకు యత్నించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- అడ్డుకున్న గ్రామస్తులు
- పరామర్శించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


బయనపల్లె గ్రామంలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటి వద్ద గుమికూడిన గ్రామస్తులు


శ్రీకాంత్‌రెడ్డిని అడిగి విషయం తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని చింతపల్లె పంచాయతీ బయనపల్లె గ్రామంలో గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి చెందిన ఇంటిని అక్రమ నిర్మాణమంటూ కూల్చివేసేందుకు భారీగా పోలీసులను మోహరింపచేసి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. అయితే గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని అధికారుల తీరును తప్పుపట్టడంతో పాటు కూల్చివేతను అడ్డుకున్నారు. అలాగే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి సంబంధిత నాయకులతో మాట్లాడారు.

కూల్చివేతకు యత్నం..

బద్వేలు–కడప రహదారిలోని బయనపల్లె గ్రామంలో సర్వే నెం. 27ఎ, 27బిలలో కొంత గ్రామ నత్తం ఉంది. సదరు స్థలాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తాతల కాలం నుండి సుమారు 60 ఏళ్ల కిందటి నుండి 8 సెంట్ల స్థలాన్ని స్వాధీనానుభవంలో ఉంచుకున్నారు. సదరు స్థలం పక్కనే గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సీసీరోడ్లు సైతం నిర్మించారు. అయితే గత పదేళ్ల క్రితం శ్రీకాంత్‌రెడ్డి అందులో ఒక ఇంటిని నిర్మించుకుని కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. ఇటీవల కాలంలో శ్రీకాంత్ రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండడంతో పాటు రెండు రోజుల క్రితం జరిగిన యువతపోరు కార్యక్రమానికి బద్వేలు పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున యువతను కడపకు తరలించారు. దీనిని జీర్ణించుకోలేని రూరల్ పరిధికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్యనేత వద్ద శ్రీకాంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చి వేసేందుకు సిద్ధమయ్యారు.

అడ్డుకున్న గ్రామస్థులు

టీడీపీ ముఖ్యనేత ఆదేశాలతో శ్రీకాంత్‌రెడ్డి నివసిస్తున్న ఇంటిని కూల్చివేసేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పాటు భారీగా పోలీసులు వచ్చారన్న విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. సమీప ప్రాంతాల్లో చెరువును సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ముందు వాటిని తొలగించి తర్వాత ఇక్కడికి రావాలని అధికారులకు తేల్చిచెప్పారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఇంటిని కూల్చివేసే చర్యలు కొంతసేపు ఆపారు. ఇదే సమయంలో బద్వేలు రూరల్, బి.కోడూరు, అట్లూరు మండలాల నుండి పెద్ద ఎత్తున పోలీసు బలగాలను రప్పించడంతో పాటు అడ్డుకునే వారిపై నీళ్లు కొట్టేందుకు ఫైరింజన్‌ను సైతం పిలిపించారు. అయితే గ్రామస్థులు వారి చర్యలకు బెదరకుండా గట్టిగా నిలబడడంతో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడే కాపుకాశారు.

పరామర్శించిన ఎమ్మెల్సీ..

కక్షపూరిత చర్యల్లో భాగంగా వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చివేసేందుకు యత్నిస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, జడ్పీటీసీ పోలిరెడ్డి తదితర నాయకులు పెద్ద ఎత్తున బయనపల్లెకు చేరుకున్నారు. ముందుగా మున్సిపల్ చైర్మన్ ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దారు ఉదయభాస్కర్ రాజు, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌లతో చర్చించి కొంత సమయం ఇచ్చి అక్రమ నిర్మాణమని తేలితే స్వచ్ఛందంగా తొలగించుకుంటామని తెలిపారు. ఇంతలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అక్కడికి చేరుకోవడంతో కొద్దిసేపటికి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులు అక్కడి నుండి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్సీ తహసీల్దారు, ఇరిగేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తమ పార్టీకి చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చివేసేందుకు అధికారులపై ఒత్తిడిని తీసుకువచ్చినట్లు తెలుస్తుందని అన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఎప్పుడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని గుర్తు చేశారు.

ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీలక్ష్మీసాయి ఫర్నీచర్ దుకాణంలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో దుకాణంలోని సుమారు రూ.10 లక్షలు విలువ చేసే ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. పట్టణానికి చెందిన సి.హెచ్ గోపాలక్రిష్ణ నెల్లూరు రోడ్డులో కొన్నేళ్లుగా ఫర్నీచర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరే గురువారం దుకాణం తెరిచి వ్యాపారం నిర్వహించుకుని రాత్రి సమయంలో దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. కొద్ది సేపటికి దుకాణం నుంచి దట్టమైన పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించి దుకాణ యజమానికి తెలిపారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అప్పటికే బయనపల్లె గ్రామంలో ఉన్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని సుమారు రూ.10 లక్షలు విలువ చేసే సోఫాసెట్లు, పరుపులు, కూలర్లు, డబుల్‌కాట్‌మంచాలు కాలిపోయాయి. మంటలను అదుపు చేయడంతో కొంత సామగ్రిని కాపాడుకోగలిగారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

భారీ స్కోరు దిశగా కడప జట్టు


201 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్ రెడ్డి


139 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ గురు విఘ్నేష్


4 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ వరుణ్ సాయి నాయుడు


4 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ టీవీ సాయి ప్రతాప్‌రెడ్డి


103 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ కేహెచ్ వీరారెడ్డి

డబుల్ సెంచరీ చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లో కడప జట్టు భారీ స్కోరు దిశగా ఆడుతోంది. తొలి రోజు గురువారం వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 93 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 401 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రణీల్ రెడ్డి తన బ్యాటింగ్‌తో విజృంభించి 291 బంతుల్లో 23 ఫోర్లతో 201 పరుగులు చేశాడు. గురు విఘ్నేష్ 147 బంతుల్లో 15 ఫోర్లు, 6 సిక్సర్లతో 139 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మల్లికార్జున 2 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

అదే విధంగా కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 50.4 ఓవర్లకు 212 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మన్విత్‌రెడ్డి 48, సయ్యద్ షాహుల్ హుస్సేన్ 32 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీవీ సాయి ప్రతాప్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు, వరుణ్ సాయి నాయుడు 4 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 34 ఓవర్లకు 1 వికెట్ కోల్పోయి 194 పరుగులు చేసింది. ఆ జట్టులోని కేహెచ్ వీరారెడ్డి, 107 బంతుల్లో 19 ఫోర్లు, 2 సిక్సర్లతో 103 పరుగులు చేయగా జయంత్ కృష్ణ 78 పరుగులు చేశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

అత్యుత్తమ నాణ్యతకు హామీ భారతి సిమెంట్


మాట్లాడుతున్న భారతి సిమెంట్ కంపెనీ డీజీఎం ఓబుళరెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : నాణ్యతా ప్రమాణాలలో మేటి భారతి సిమెంట్ అని భారతి సిమెంట్ కంపెనీ డీజీఎం ఓబుళ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని స్థానిక మైరా రెస్టారెంట్‌లో కాంట్రాక్టర్లకు భారతి సిమెంట్ అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. ఇతర కంపెనీ సిమెంట్‌తో పోలిస్తే తక్కువ సమయంలోనే భారతి సిమెంట్ సెట్ అవుతుందన్నారు. వేగంగా కట్టే బిల్డింగ్‌లకు అత్యుత్తమ పరిణామాలను, నాణ్యతను భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ రెండు గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. చాలా దృఢత్వాన్ని కలిగి ఉన్న భారతి సిమెంట్‌తో కట్టడాలు త్వరగా పూర్తవుతాయన్నారు. మార్కెట్‌లో చాలామంది బిల్డర్లు, కాంట్రాక్టర్లు భారతి సిమెంట్ వాడుతున్నారన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ కంపెనీ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, నాగేంద్రబాబు, డీలర్ అశోక్, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా కేసులో ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం బుడిగుంటపల్లి పంచాయతీ, దేశెట్టిపల్లి క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ తులసీ మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.